Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 326 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 6 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## ప్రధాని మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి భేటీ.. ఎందుకంటే..



**న్యూఢిల్లీ :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాంటి వేళ.. ప్రధాని మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సోమవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఆదివారం ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో.. అంతకు రోజు..అంటే శనివారం నావల్ చీఫ్ స్టాఫ్ దినేష్ కే త్రిపాఠితో ప్రధాని మోదీ వరుసగా సమావేశమయ్యారు. గత వారం ప్రధానితో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర దివ్వేది భేటీ అయ్యారు. ఇలా వరుసగా త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ భేటీ కావడం.. తాజాగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సైతం సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకొంది. పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో గత మంగళవారం ఉన్నత స్థాయి అధికారులతో ప్రధాని మోదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదీకాక పాక్‌పై భారత్ తీవ్ర ఆంక్షలు విధించింది. గతంలో పాక్‌తో చేసుకున్న సింధూ నది జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. అలాగే భారత్ గగన తలంలో పాక్ విమానాల రాకపోకలను సైతం నిషేధించింది. అదేవిధంగా పాకిస్థాన్‌తో ప్రత్యక్ష, పరోక్ష ఎగుమతులు, దిగుమతులను సైతం భారత్ నిషేధించింది. పాకిస్థాన్‌ను పూర్తిగా అష్టదిగ్బంధం చేసేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో.. వాటన్నింటిని చేసేందుకు భారత్ ఆ దిశగా అడుగులు వేస్తోంది. పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం ఉందనేందుకు కీలక సాక్ష్యాలను భారత్ సంపాదించింది. వీటిని ప్రపంచ దేశాల ముందు ఉంచింది. దీంతో భారత్‌కు ప్రపంచదేశాల నుంచి మద్దతు లభిస్తోంది.

## సింహాచలం దుర్ఘటన.. ఏడుగురిపై సస్పెన్షన్ వేటు



**అమరావతి, (రాజధాని వార్తలు):** సింహాచలం దేవస్థానంలో దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి త్రిసభ్య కమిషన్ సోమవారం నివేదిక అందించింది. ఆ కొద్దిసేపటికే కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ దుర్ఘటనకు బాధ్యులైన ఏడుగురిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. దేవాదాయ శాఖతో పాటు పర్యాటక శాఖలలోని వారిపై ఈ సస్పెన్షన్ వేటు వేసింది. సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, సింహాచలం దేవస్థానం ఈఈ డి జి శ్రీనివాసరాజు, ఏపీటీడీసీ ఈఈ కె రమణ, దేవస్థానం డిప్యూటీ ఈఈ కె ఎస్ ఎన్ మూర్తి, ఏపీటీడీసీ డిప్యూటీ ఈఈ ఏ బీ వీ ఎల్ ఆర్ స్వామి, ఏపీటీడీసీ ఏఈ పి మదన్ మోహన్, దేవస్థానం జేఈ కె బాబ్జీపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇక కాంట్రాక్టర్ కె లక్ష్మీనారాయణపై క్రిమినల్ చర్యల తీసుకోవాలని ఆదేశించింది. సింహాచలం దేవస్థానంలో దుర్ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం కమిషన్ నివేదిక అందజేసింది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కమిషన్ నిర్ధారించింది. తీవ్ర నిర్లక్ష్యంతో భక్తుల ప్రాణాలు కోల్పోవడానికి కాంట్రాక్టర్, అధికారులు కారణమయ్యారని ఆ నివేదికలో స్పష్టం చేసింది. ఇక ఈ కమిషన్ సిఫార్సు ఆధారంగా చర్యల తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయించింది. కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వ నిర్ణయించింది. కాంట్రాక్టర్ సహా ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రికి కమిషన్ నివేదిక అందజేసింది. ఈ త్రిసభ్య కమిటీలో సభ్యులుగా ఐఎఎస్, ఐపిఎస్, ఇంజినీరింగ్ అధికారులున్నారు. ఈ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ అధికారుల సస్పెన్షన్‌కు ప్రభుత్వం ఆదేశించింది.

## విశాఖలో షాకింగ్ ఘటన.. మహిళ స్కూటీపై వెళ్తుండగా...

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మృత్యువు ఎలా వస్తుందో ఎవరికీ తెలియదు. అప్పటి వరకు సరదాగా గడుపుతున్న వారు అనుకోకుండా మృత్యు ఒడిలోకి వెళ్తుంటారు. ఈ మధ్యకాలంలో బయటకు వెళ్లిన మనిషి ఇంటికి వచ్చేదాకా కూడా టెన్షన్ అనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఎలాంటి ప్రమాదాల బారిన పడతారో తెలియదు. మామూలుగా నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తుల పైకి వాహనాలు దూసుకు రావడం, లేదా పిడుగులు పడటంతో, చెట్లు పడటంతో ప్రాణాలు కోల్పోతుంటారు. మృత్యువు ఏ రూపంలో వస్తుందో.. ఎలా వస్తుందో కూడా ఎవరూ ఊహించను కూడా ఊహించలేదు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే వార్త కూడా అలాంటిదే. రోడ్డు మీద వెళ్తున్న మహిళను ఎలా మృత్యువు కబలించిందో చూస్తే రోమాలు నిక్కపొడుచుకోవడం ఖాయం. విశాఖపట్నంలో విషాదం చోటు చేసుకుంది. చెట్టుకూలి ఓ మహిళ మృతి చెందింది. విశాఖకు చెందిన పూర్ణిమ అనే మహిళ తన స్కూటీపై వెళుతోంది. ఏఎంజీ ఆస్పత్రి సమీపానికి చేరుకుంది మహిళ. కానీ ఆ మార్గంలో ఆమెకు ప్రమాదం పొంచి ఉందని




తెలీక ఎప్పటిలాగే స్కూటీపై వెళ్తోంది. ఇంతలోనే అక్కడే ఉన్న ఓ భారీ చెట్టు ఆమెపై పడిపోయింది. పెద్ద వృక్షం పడటంతో ఆ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ దృశ్యాలన్నీ కూడా అక్కడ ఉన్న సీసీ టీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. అసలు ఇలా జరుగుతుందని మహిళ కూడా ఊహించి ఉండదు. దీంతో స్కూటీ ప్రయాణమే ఆమెకు చివరి ప్రయాణంగా మిగిలిపోయింది.

## బస్ భవన్‌ను ముట్టడించిన కార్మికులు.. పరిస్థితి ఉద్రిక్తం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం వారు కవాతు నిర్వహించారు. అందులోభాగంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్దనున్న బస్ భవన్‌ను తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సోమవారం ముట్టడించారు. దీంతో బస్ భవన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మరోవైపు సమ్మె యధావిధిగా కొనసాగుతోందని ఆర్టీసీ జేఏసీ ఈ సందర్భంగా ప్రకటించింది. సమ్మె నేపథ్యంలో తమతో చర్చలకు ఆర్టీసీ యాజమాన్యం పిలవకపోవడంపై జేఏసీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోతాయని చెప్పారు. తమ సమ్మెకు సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. మే 7వ తేదీ నుంచి తాము తలపెట్టిన సమ్మె యధా విధిగా కొనసాగుతుందని జేఏసీ నేతలు స్పష్టం చేశారు. కార్మికుల కవాతు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఆదివారం ఆర్టీసీ కార్మిక నేతలతో సమావేశమయ్యారు. సమ్మెను ఉప సంహరించుకోవాలని వారికి ఆయన సూచించారు. ఆర్టీసీ సంస్థ ఇప్పుడే లాభాల బాట పడుతోందని వారికి వివరించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డి సర్కార్ కొలువు తీరిన అనంతరం ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన వివరాలను వారికి ఆయన




సోదాహరణగా వివరించారు. అయితే ఆర్టీసీ జేఏసీ నేతలు మాత్రం తమ సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోమని స్పష్టం చేశారు. ఆ క్రమంలో ఆర్టీసీ కార్మికులు సోమవారం కవాతు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ముఖ్య కార్యాలయం బస్ భవన్‌ను వారు ముట్టడించారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. మే 7వ తేదీ నుంచి తాము సమ్మెకు వెళుతున్నట్లు తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా ఏప్రిల్ 27వ తేదీన అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్టీసీ జేఏసీ విడుదల చేసింది. మేడే స్ఫూర్తితో తాము ఈ సమ్మెకు సిద్ధమయ్యామంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి ఆర్టీసీ జేఏసీ తీసుకు వెళ్లింది.

## ఆ రెండు దేశాలు సహకార స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించుకోవాలి

### - జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. "నాగపట్నం జిల్లాకు చెందిన ఈ మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం.. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నాను" అని పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు డిప్యూటీ సీఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

**అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుంది..**

"కాగా రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుంది"... అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు.

**నాడు చెప్పాం.. నేడు చేస్తున్నాం...**

అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29 వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచే వారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటుందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించిందని పవన్ కల్యాణ్ అన్నారు.

## కాలినడక భక్తుల కోసం ఉచిత ఎలక్ట్రిక్ బస్సులు




**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ అధి కారులు శుభవార్త చెప్పారు. స్వామివారిని దర్శించుకోవడానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలి వస్తారు. కొంతమంది భక్తులు కాలినడకగా అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో వస్తుం టారు. అయితే తిరుమలకు వచ్చే భక్తులు తిరుపతి నుంచి అలిపిరి, శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల దగ్గరకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ట్యాక్సీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ క్రమంలో టీటీడీ సరికొత్త ఆలోచన చేసింది.

**20 ఎలక్ట్రిక్ బస్సులు..**

కాలినడకన తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల కోసం 20 ఎలక్ట్రిక్ బస్సులను ఉచితంగా నడపనుంది. ఈ వాహనాల్లో తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి మీదుగా శ్రీవారి మెట్టు వరకు యాత్రికులను తీసుకెళ్లాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో ఉచిత ధర్మరథం బస్సులను ఏర్పాటు చేసినా భక్తుల రద్దీకి అనుగుణంగా లేవు. ఇదే అదనుగా జీపు, ట్యాక్సీ, ఆటోడ్రైవర్లు భక్తులను అడ్డంగా దోచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో నిర్వహించే టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో దాతల సహకారంతో బస్సులను కొనుగోలు చేసేలా నిర్ణయం తీసుకుంటారని తెలియవచ్చింది.

**పుష్పయాగం**

కాగా తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోదండరామస్వామివారి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఆలయంలోని ఊంజల మండపంలో అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజా, తామర, కలువ, మొగలి రేకులు వంటి 12 రకాల పూలు, ఆరు రకాల ఆకులు కలిపి మొత్తం 3 టన్నుల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు.

# 500 పైగా ప్రాంగణ నియామకాలలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల హవా



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల అని డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ పట్టా అందుకోకముందే ఇప్పటివరకు 500పైగా కార్పొరేట్ ఉద్యోగాలు సాధించడం శ్రీకాకుళం విద్యావ్యవస్థలో చరిత్ర సృష్టించామన్నారు. ఇంటర్ తర్వాత ఎం చేయాలనీ ఆలోచించకుండా డిగ్రీలో తమ పిల్లలను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడాలని తల్లితండ్రులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇంజనీరింగ్‌కు ధీటుగా కార్పొరేట్ కొలువులను డిగ్రీ మీద అందిస్తున్నామని, ఇందుకు కారణం డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రస్తుత రోజులలో సాఫ్ట్వేర్ రంగాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న కోడింగ్ పైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పై మీ ప్రో, కంప్యూటర్ లాంగ్వేజ్‌లపై సిస్కో, ఒరాకిల్ అకాడమీ మొదలగు సంస్థలతో అవగహన ఒప్పందాలను చేసుకున్నామని, ఇవి విద్యార్థినిలకు ఉద్యోగాలు సాధించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. వీటితో పాటు ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, క్యాంపస్ కొలువులే కాకుండా, అకడమిక్ పైన కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి యూనివర్సిటీ స్థాయి పరీక్షా ఫలితాలలో మొదటి స్థానాలలో నిలుస్తున్నామన్నారు. పిల్లలను ఉన్నతమైన కార్పొరేట్ ఉద్యోగాలలో ఉండాలని ప్రతీ తల్లిదండ్రులు ఆశిస్తారని, ఆ కోరికను కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలు నిజం చేస్తున్నాయన్నారు. తమ కళాశాలలో అందిస్తున్న శిక్షణ ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుందని, క్రమ శిక్షణతోపాటు, ఉత్తమ ఫలితాలు, కార్పొరేట్ కొలువులతో తమ కళాశాల శ్రీకాకుళం జిల్లాలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఉద్యోగాలు సాదించిన విద్యార్థినిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డా. ఎన్.సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఈ.వి.ఎల్ నాయుడు అభినందించారు.

# ఉగ్ర దాడిని వ్యతిరేకిస్తూ హిందూ సంఘాల నిరసన

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కాశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులను అతి క్రూరంగా కాల్చి చంపిన ఉగ్రవాద దాడులను ఖండిస్తూ పెద్దాపురం పట్టణంలోని పలు హిందూ సంఘాలు నిరసన ర్యాలీని నిర్వహించాయి. పాకిస్టాన్ దేశానికి వ్యతిరేకంగా హిందువులు నినదించారు. స్టానిక వెంకటేశ్వరస్వామి గుడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా, వేములవారీ సెంటర్, దాసాంజనేయ స్వామి గుడి, మున్సిపల్ సెంటర్ మీదగా ఆర్డీవో కార్యాలయం వరకు పెద్ద సంఖ్యలో హిందువులు ఐక్యతా చాటుతూ పాకిస్టాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మట్టే శ్రీనివాసరావు, ఖండవిల్లి శ్రీనివాసరావు, పైడిపల్లి చిన్ని, మేడిద చక్రం, వి చక్రవతి, అద్దేపల్లి రమేష్, కరెడ్ల రాజా రమేష్,




వంగలపూడి సతీష్, విత్తనాల వెంకటరమణ, అల్లు ప్రసాద్, చెరుకూరి రవికృష్ణ, వీరభద్రరావు, సునీల్, పాబోలు ప్రసాద్, సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

# మాజేటి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణానికి చెందిన మాజేటి కృష్ణ భార్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా కృష్ణ కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి ఎమ్మెల్యే తీవ్ర సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సామర్లకోట పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, పట్టణ యూత్ అధ్యక్షులు వల్లూరి దొరబాబు, తాతపూడి అరుణ్ వంశీ తదితరులు ఉన్నారు.

# 11వ తేదిన గీతం ప్రవేశపరీక్ష "గ్యాట్"

**(రాజధాని వార్తలు):** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్–2025) ను దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. గీతం ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో గీతం వెబ్‌సైట్ ద్వారా మే 8వ తేదీ లోగా ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గీతం ప్రవేశ పరీక్ష గ్యాట్–2025లో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని, ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామని ఆయన తెలిపారు. పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.edu ను సంప్రదించవచ్చునన్నారు.

# అనకాపల్లి-అచ్చుతాపురం రోడ్డు విస్తీర్ణ పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్





**మునగపాక, (రాజధాని వార్తలు):** యలమంచిలి నియోజకవర్గం మునగపాక పెద్ద మధుం దగ్గర బ్రిడ్జ్ పనులను, అనకాపల్లి నుంచి అచ్చుతాపురం రోడ్డు పనులను యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్ బ్రిడ్జి కాంక్రీట్ వాలు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అక్కడ ఉన్న ఇంజనీర్లుకు సూచించారు. అలాగే వేగంగా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస రావు, మునగపాక మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారా



యణ, మొల్లేటి ఆనంద్, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.






**అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మినిస్టర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్రని, అనకాపల్లి జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు**

# పనులు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మేజర్ డ్రెయిన్ కల్వర్టు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పెద్దా పురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశించారు. సామర్లకోట పట్టణంలోని మఠం సెంటర్లో నిర్మాణంలో ఉన్న మేజర్ డ్రైన్‌పై కల్వర్ట్ పనులను ఎమ్మెల్యే చినరాజప్ప శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కల్వర్టుకు స్లాబ్ రాళ్ళు ఏర్పాటు పనులను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. త్వరితంగా పనులు పూర్తి చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు కంటే జగదీష్ మోహన్, వల్లూరి దొరబాబు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, తదితరులు ఉన్నారు.

# భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణం, మండల పరిధిలో శనివారం సాయంత్రం జోరుగా కుండబోత వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో దాళ్వా వరిపంట మసూలు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాశులను హడావిడిగా పోగు పెట్టి ప్లాస్టిక్ బరకాలతో మూసి వర్షం నీరు ధాన్యం రాశులను ముంచకుండా జాగ్రత్తలు పడ్డారు. అయితే సామర్లకోట పిఠాపురం రోడ్లో వందలాది రాశులు ప్లాస్టిక్ బరకాలతో కప్పినప్పటికీ వర్షం నీటిలో తడవక తప్పని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులకు ప్లాస్టిక్ బరకాలు ఎగిరిపోవడంతో ధాన్యం రాశులలోకి వర్షపు నీరు చేరి ధాన్యం తడిసి పోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షం కారణంగా పట్టణంలో పలు డ్రైన్లు ముంపునకు గురి కావడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలిగించింది. ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట భారీ వర్షంతో తమ చేతికి అందుతుందో లేదో అని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# జూన్ 1 నుండి విశాఖపట్నం-విజయవాడ మార్నింగ్ ఫ్లైట్ సర్వీస్ పునఃప్రారంభం : ఎంపీ శ్రీ భరత్

## - సత్వర మద్దతు ఇచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జూన్ 1 నుండి విశాఖపట్నం మరియు విజయవాడ మధ్య ఇండిగో మార్నింగ్ ఫ్లైట్ సర్వీస్ పునఃప్రారంభం కావడం పట్ల విశాఖపట్నం ఎంపీ భరత్ సంతోషం వ్యక్తం చేశారు. గత నెలలో రద్దు చేయబడిన ఈ సర్వీస్ ఇప్పుడు ప్రజలకు మరియు వ్యాపార వర్గాలకు సేవ చేయడానికి పునరుద్ధరించబడుతుంది. ఈ సమస్యపై త్వరగా స్పందించి, ఈ ముఖ్యమైన ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పునరుద్ధరణకు దోహదపడినందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడుకు ఎంపీ భరత్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్టివిటీ వ్యాపార, పర్యాటక మరియు పరిపాలనా ప్రయాణికులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన పేర్కొన్నారు. "వైజాగ్ మరియు విజయవాడ మధ్య ఉదయం ఎయిర్ కనెక్టివిటీ ఒక సౌలభ్యం మాత్రమే కాదు, వాణిజ్య అవసరం కూడా. ఇది పునరుద్ధరించబడుతుండటం నాకు సంతోషంగా ఉంది మరియు దీనిని సాధ్యం చేసినందుకు మంత్రి రామ్ మోహన్ నాయుడు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని ఎంపీ భరత్ అన్నారు. విశాఖపట్నం నుండి ఇతర కీలక నగరాలకు కూడా ఎయిర్ కనెక్టివిటీని బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన హామీ ఇచ్చారు.

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు : ఏడిఏ బాబురావు






**కరప, (రాజధాని వార్తలు):** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమి సాంద్రత పెంచి, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అభివృద్ధి అధికారి బాబురావు పేర్కొన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గ్రామ సభ సందర్భంగా విజయరాయుడుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సహజ సిద్ధంగా ఎదిగి, పంట పొలం మట్టి ఆరోగ్యంగా మారుతుందన్నారు. 31 రకాల పీఎండీఎస్ విత్తనాలను భూమిలో వేయడం ద్వారా సూక్ష్మ ధాతువులు పెరిగి భూసారం మెరుగవుతుందని, దీని వలన ప్రజల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. అనంతరం ఆదర్శ రైతులుగా మద్దా వీర్రాజు, నందికోళ్ళ సత్యారావు, త్రిపర్తి సత్యనాయుడు రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి, సర్పంచ్ వి.సీతారామ రాఘవ, పంచాయతీ కార్యదర్శి వీరభద్రరావు, విఏఏలు, ఎల్‌టూ పనింద్ర, ఐసిఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

# సమంత వైజాగ్ సెంటిమెంట్... హిట్ ఖాయం



సమంత చాలా రోజుల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. తెలుగులో ఈమె చివరగా నటించిన ఖుషి సినిమాతో 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ఆ సినిమా తర్వాత తెలుగులో ఈమె పెద్దగా సినిమాలు చేయడం లేదని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిటాడెల్ వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు త్వరలోనే శుభం సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు గాను రెడీ అయింది. అయితే ఈసారి నటిగా కాకుండా నిర్మాతగా తెలుగు ప్రేక్షకుల ముందుకు సమంత రాబోతుంది. అంతా కొత్తవారితో సమంత నిర్మించిన ‘శుభం’ సినిమా విడుదలకు సిద్ధం అయింది. ఇప్పటికే వచ్చిన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచింది. ఈనెల 9న విడుదల కాబోతున్న శుభం సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో నిర్మాతగా సమంత పాల్గొంటున్నారు. ఈ సినిమాను నిర్మించడం మాత్రమే కాకుండా చిన్న అతిథి పాత్రను చేయడం ద్వారా శుభం సినిమా పై సమంత అంచనాలు పెంచింది అనడంలో సందేహం లేదు. తాజాగా సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా సమంత వైజాగ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొంది. ఆ కార్యక్రమంల సమంత మాట్లాడుతూ శుభంపై అంచనాలు పెంచడం మాత్రమే కాకుండా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శుభం సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సమంత మాట్లాడుతూ....నాకు వైజాగ్‌తో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. మజిలి సినిమా మొదలుకుని చాలా సినిమాలు ఇక్కడ చేశాను. రంగస్థలం కోసం వైజాగ్‌లో చాలా రోజులు ఉన్నాం. అందుకే వైజాగ్ ప్రేక్షకులతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని సమంత చెప్పుకొచ్చారు. తనకు వైజాగ్ ప్రేక్షకులు చాలా విజయాలను అందించారు. ఈ సినిమాతో మరో విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని సమంత చెప్పుకొచ్చింది. ఈ సినిమా తో నిర్మాతగా పూర్తి స్థాయిలో మారిన సమంత నటిగానూ ఈ సినిమాలో కొంత సమయం కనిపించిన నేపథ్యంలో తప్పకుండా మంచి విజయాలను సొంతం చేసుకుంటుందనే నమ్మకంను ప్రేక్షకులు వ్యక్తం చేస్తున్నారు. సమంత అనారోగ్య సమస్యల కారణంగా దాదాపు ఏడాది కాలం పాటు సినిమా ఇండస్ట్రీకి పూర్తి దూరంగా ఉన్న విషయం తెల్సిందే. అందుకే ఈమె కొత్త సినిమాలు ఏమీ ఈ మధ్యలో ప్రేక్షకుల ముందుకు రాలేదు. కానీ నటిగా ఈమె త్వరలోనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

అంతే కాకుండా తెలుగులో మా ఇంటి బంగారం అనే సినిమాలోనూ నటిస్తోంది. ఆ సినిమాకు సంబంధించిన ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఈ ఏడాది సినిమా వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అయితే ఈమె సౌత్‌లో కంటే బాలీవుడ్‌లో బిజీగా ఉండాలని ఆశ పడుతున్నట్లు సమాచారం అందుతోంది. సమంత మరో పెళ్లి విషయమై ప్రముఖంగా వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు సామ్ అధికారికంగా స్పందించలేదు.

# టాలీవుడ్‌లో కన్నడ భామల డిమాండ్




హీరోయిన్ శ్రీనిధి శెట్టికి ఎంతో టాలెంట్ ఉంది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించి అందరికీ పరిచయమైంది శ్రీనిధి. కానీ ఆ సినిమాలు హీరో పాత్ర ప్రధానంగా తెరకెక్కడంతో శ్రీనిధి శెట్టి కేవలం గ్లామర్ పాత్రకే పరిమితమైంది. కెజిఎఫ్ సినిమాల్లో నటించడం ద్వారా శ్రీనిధికి పాన్ ఇండియా స్థాయిలో అటెన్షన్ అయితే వచ్చింది కానీ స్టార్‌డమ్ మాత్రం రాలేదు. కానీ రీసెంట్‌గా తెలుగులో శ్రీనిధి చేసిన హిట్3 సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో ఆ సినిమా అమ్మడికి మంచి స్టార్ డమ్‌ను తెచ్చి పెట్టింది. హిట్3 సక్సెస్‌తో శ్రీనిధి తెలుగులో బిజీ అయ్యే అవకాశాలు పుష్కలంగానే కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడో ఇంట్రెస్టింగ్ విషయముంది. కన్నడ సినిమా నుంచి వచ్చిన రష్మిక మందన్నా, శ్రీలీల తమ కెరీర్ ను కన్నడలోనే మొదలుపెట్టారు కానీ ఎప్పుడైతే తెలుగు సినిమాలు చేశారో అప్పట్నుంచి వారికి విపరీతమైన స్టార్‌డమ్ వచ్చి ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీ అయ్యారు. రష్మిక, శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా తమ సత్తా చాటుతున్నారు. రీసెంట్ టైమ్‌లో సప్త సాగారాలు దాటి ఫ్రాంచైజ్ సినిమాలతో సక్సెస్ అందుకున్న రుక్మిణి వసంత్ కూడా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. డ్రాగన్ మూవీ షూటింగ్ కూడా పూర్తవకముందే రుక్మిణి డిమాండ్ టాలీవుడ్ లో బాగా పెరిగింది. దీంతో ఇప్పుడు శ్రీనిధి శెట్టి కూడా కన్నడలో కెరీర్ ను స్టార్ట్ చేసి తెలుగులో స్టార్‌డమ్ అందుకున్న హీరోయిన్ల లిస్ట్ లో చేరింది. ఇక శ్రీనిధి విషయానికొస్తే ఆమె మధ్యలో కోబ్రా అనే తమిళ సినిమా చేసింది, కానీ అది శ్రీనిధికి అనుకున్న గుర్తింపు ఇవ్వలేదు. మూడేళ్ల తర్వాత ఆమె హిట్3తో తిరిగి సిల్వర్ స్క్రీన్ పై మెరిసి మంచి హిట్‌తో పాటూ భారీ గుర్తింపును కూడా అందుకుంది. హిట్3 రిలీజ్ కు ముందే ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొంటూ సోషల్ మీడియాలో ఎంతోమందిని ఎట్రాక్ట్ చేసిన శ్రీనిధి గురించి అందరూ డిస్కస్ చేసుకున్నారు. హిట్3 సక్సెస్‌తో ఆల్రెడీ శ్రీనిధికి టాలీవుడ్‌లో డిమాండ్ పెరిగింది. హిట్3 సక్సెస్‌తో ఆమె వెంటనే స్టార్ హీరోయిన్ల లీగ్‌లోకి ఎంటరయ్యే ఓ భారీ ఛాన్స్ దొరకడమే ఆలస్యం. ప్రస్తుతం సిద్దు జొన్నలగడ్డ హీరోగా శ్రీనిధి శెట్టి తెలుసు కదా అనే సినిమా చేస్తోంది. ఈ సినిమాతో పాటూ కన్నడలో సుదీప్‌తో ఓ సినిమా చేస్తోంది శ్రీనిధి.

# ‘పుష్ప 2’ తర్వాత ‘పెద్ది’... ఇది చాలా స్పెషల్ గురూ!



టాలీవుడ్‌లో శ్రీలీల ప్రస్తుతం మోస్ట్ యాక్టివ్ హీరోయిన్ అనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాయి. మొదటి సినిమా పెళ్లి సందడి పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయినా కూడా లక్ కలిసి వచ్చి శ్రీలీలకు ధమాకా సినిమాతో బిగ్ హిట్ దక్కింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఏకంగా అర డజను సినిమాలు చేసే అవకాశం ను దక్కించుకున్న విషయం తెల్సిందే. గత ఏడాది మహేష్ బాబు మూవీ గుంటూరు కారం తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన ఏడాది చివర్లో పుష్ప 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంది. అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటెం సాంగ్ మరో స్థాయికి సినిమాను తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈమె ఒక సినిమాను చేస్తుంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటెం సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఆ బిగ్ మూవీ మరేదో కాదు మెగా పవర్ స్టార్ నటిస్తున్న పెద్ది సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో పుకార్లు గుప్పుమంటున్నాయి. రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే ధీమాతో ప్రేక్షకులు ఉన్నారు. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. ఆ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం అందుతోంది. పుష్ప 2 సినిమాతో శ్రీలీల ఐటెం సాంగ్‌తో ఆకట్టుకుంది. కనుక రిస్క్ తీసుకోకుండా, కొత్త అమ్మాయితో కాకుండా శ్రీలీలను ఐటెం సాంగ్ కు ఎంపిక చేయడం అనేది మంచి నిర్ణయం అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. శ్రీలీల కూడా ఐటెం సాంగ్స్ చేసేందుకు ఓకే అంటుంది. పైగా రామ్ చరణ్ వంటి బిగ్ స్టార్‌కి జోడీగా ఐటెం సాంగ్‌లో నటించడం, పైగా ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన పాటలో కనిపించాలి అనుకోవడం ఎవరికి అయినా డ్రీమ్. కనుక శ్రీలీల కచ్చితంగా అవకాశం వస్తే పెద్ది సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ విషయం గురించి ప్రముఖంగా చర్చ జరుగుతోంది. త్వరలోనే మరింత క్లారిటీ రావాల్సి ఉంది. సుకుమార్ సినిమాను ఫాలో అవుతూ బుచ్చిబాబు పెద్ది సినిమాను తీస్తున్నాడు. కనుక ఐటెం సాంగ్ ఖచ్చితంగా ఉండబోతుంది. ఆ ఐటెం సాంగ్‌లో శ్రీలీల ఉంటుందా అనేది చూడాలి.

# ఇక్కడ ఓకే...మరి అక్కడ ఎప్పుడు పవన్ జీ!



ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ‘హరిహర వీరమల్లు’ షూటింగ్ షురూ చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం నుంచి చివరి షెడ్యూల్ మొదలవ్వడంతో చిత్రీకరణకు హాజరవుతున్నారు. హైదరాబాద్లో ప్రత్యేకంగా వేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు చిత్రీకరణ జరుగుతుంది. ఇందులో పవన్ పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. అంటే మరికొన్ని గంటల్లో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. అనంతరం 6వతేదిన గుమ్మడికాయ కొట్టేస్తారు. అటుపై కొత్త రిలీజ్ తేదీని ప్రకటిస్తారు. ఇలా వీరమల్లు గట్టెక్కిసినట్లే. మరి ‘ఓజీ’ సంగతేంటి? అంటే ఉలుకు పలుకు లేకుండా కనిపిస్తుంది. కొన్ని నెలలుగా ఆ సినిమా మేకర్స్ కూడా పవన్ రాక కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఇదిగో వస్తు న్నాను..అదిగో వస్తున్నాను అనే మాట తప్ప ఆయన రావడం మాత్రం కనిపించలేదు. ఈ గ్యాప్‌లో అటెన్షన్ తప్పకుండా ఏదో విషయం చెబుతూ టీమ్ కూడా మ్యానేజ్ చేసుకుంటూ వచ్చింది. అలాగని ఇంకెంత కాలం మ్యానేజ్ చేయగలరు. వాళ్లు కూడా కొన్ని రోజులుగా సైలెంట్‌గానే ఉంటున్నారు. ఆయన వచ్చినప్పుడు చూసుకుందాంలే అన్న ధీమాకి వచ్చేసారు. అయితే వీరమల్లు పూర్తయిన నేపథ్యంలో పవన్ ‘ఓజీ’కి కూడా డేట్లు ఇచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సినిమాకు పవన్ చాలా రోజులు డేట్లు కేటాయించాలి. హైదరాబాద్ సహా ముంబైలో కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాలి. పవన్ డేట్లు ఇస్తే టీమ్ తో పాటే కొన్ని రోజులు ఉండాలి. మధ్యలో రాజకీయం అంటూ అమరావతి రావడానికి వీలుండదు. ఇవన్నీ చూసుకుని పవన్ ఓజీకి డేట్లు కేటాయించాల్సి ఉంది. మరి దీనికి సంబంధించి రెండు..మూడు రోజుల్లో కొత్త అప్‌డేట్ ఏదైనా వస్తుందేమో చూడాలి.

# అగనంపూడి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన బిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలిరెడ్డి నాగేశ్వరరావు






**విశాఖ, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 79వ వార్డ్ అగనంపూడి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలిరెడ్డి నాగేశ్వరరావు వితరణతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రమును ప్రారంభించారు. అనంతరము ఆయన మాట్లాడుతూ ఎండ త్రీవ్రత నుండి ప్రజలు కార్మికులు వాకర్స్ ఉపశమనం పొందడానికి మజ్జిక చలివేంద్రమును ఏర్పాటు చేయడం పట్ల వాకర్స్ క్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మడుగుల నర్సింగరావు మాట్లాడుతూ బలిరెడ్డి నాగేశ్వరరావు చలివేంద్రానికి వితరణ గతంలో వాకర్స్‌కి టీ షర్టు మరియు ఇటీవల వాకింగ్ ట్రాక్ గ్రౌండ్ గుంతలు పడితే జెసిబిచే గుంతలు కప్పించిడం తదితర సేవలు అందిస్తున్నందుకు ఆయనకి ధన్యవాదాలు తెలియజేసారు. అగనంపూడి వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి రామారావు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడిసి చైర్మన్ బలరెడ్డి సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు చిన్ని పూర్ణ కిషోర్, బాబు కరణం పైడ్రాజు, సింహాచలం నాయుడు, వెంకటేశ్వరరావు, జెర్రిపోతుల అప్పారావు, లక్ష్మణరావు మరియు వాకర్స్ పాల్గొన్నారు.

# సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ద్వారా నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లా, పోలాకి మండలం, జోగంపేట గ్రామస్తురాలైన పాప ఫ్రాన్సిస్‌కు ఇద్దరు పిల్లలు, భర్త లేరు సొంత ఇల్లు మరియు రేషన్ కార్డు కూడా లేదు, రోజువారి కూలికి ఒక విద్యా సంస్థలో పనిచేస్తూ, పిల్లల్ని చదివించగలుగుతున్నారు, ఇప్పుడు ఉంటున్న ఇల్లు ఒక పెద్దాయన వీళ్ళు జీవించడానికి ఏర్పాటు చేశారు, ఆర్థికంగా మరియు ఆరోగ్యపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారు అని సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి దృష్టికి చుట్టుపక్కల గ్రామాల పెద్దలు ద్వారా తెలియడంతో వెంటనే స్పందించి ఈరోజు మన సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి తరపున రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేయటమైనది. అలాగే వాళ్లకు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తే వైద్యం ఖర్చులు డాక్టర్ బ్రహ్మంగారు చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో త్రినాధరావు మాస్టర్, డాక్టర్ బ్రహ్మం, వరప్రసాద్, కోరాడ నాగరాజు, సూర్య ప్రకాష్, గోవిందరామారావు మరియు గ్రామ పురజనుల పాల్గొన్నారు.

# శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఉత్సవ మండపంలో హుండీ లెక్కింపు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** శ్రీ నూకాంబిక అమ్మవారికి భక్తులు హుండి ద్వారా తే 16-4-2025 ది నుండి నుండి 5-05-2025 ది వరకు మొత్తం 19 రోజులలో సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను సోమవారం నాడు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానము ఉత్సవ మండపములో హుండీ లెక్కింపు జరిగినది. సదరు లెక్కింపులో నగదుగా రూ 34.80.099/- లు, బంగారం గ్రాములు 27,500 మిల్లీగ్రాములు వెండి 601 గ్రాములు వచ్చినది. సదరు హుండీ లెక్కింపులో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) ఆలయ సహాయ కమీషనరు & కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలుసూరే సతీష్,దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాస రావు, కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి మరియు హుండీ పర్యవేక్షకులు టి సాంబ శివరావు, కూటమి నాయకులు, అనకాపల్లి, పర్యవేక్షణలో లెక్కింపు జరిగినది. సదరు హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు వారు మరియు భక్తులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్. అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలి

## - అర్జీల పరిష్కారంపై సిబ్బందికి శిక్షణ అందించాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని, అర్జీకి సరైన వివరణతో సమాధానం యివ్వాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జిల్లా విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకున్న అర్జీల పరిష్కారం గూర్చి సంబంధిత జిల్లా అధికారులు, నియోజకవర్గ మరియు మండల ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై జిల్లా కలెక్టరు శాఖల వారీగా సమీక్షచేసారు. అర్జీల పరిష్కార ప్రక్రియపై ప్రతి శాఖ అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీలో తెలిపిన సమస్యకు సంబంధించి వివరణ స్పష్టంగా తెలపాలని, అర్జీదారునికి సమస్య పరిష్కారం గూర్చి అర్ధమయ్యేవిధంగా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారులు హర్షిత, వర్షితల ఆలోచనకు సలాం

## - సంఘ సేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్




**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** చిన్నారులు హర్షిత, వర్షితల ఆలోచనకు సలాం అని సంఘసేవకులు, సామాజిక కార్యకర్త, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ చైర్పర్సన్ ఉర్లం. శివతేజ పట్నాయక్ సోమవారం అన్నారు. శ్రీకాకుళం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.విజయ్ కుమార్ కుమార్తెలు హర్షిత, వార్షితలు స్థానిక గొంటి వీధిలో నిరుపేదలకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారుల తండ్రి విజయ్ కుమార్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ఉర్లం. శివతేజ నగరంలో ముఖ్య కూడలితోపాటు, నైట్ షెల్టర్‌లో చేస్తున్న సేవలు చూస్తున్నామని, ఇక్కడ నిస్సహాయ వృద్ధుల కోసం, నిరంతరం ఎవరో ఒకరి సాయంతో నిరుపేదల ఆకలి తీరుస్తున్నారని, నేను గత పద్దెనిమిది రోజుల నుండి, నగరంలో ఉండే అభాగ్యులకు నా వంతు సహకారమందిస్తున్నానన్నారు. ఈ రోజు నా కుమార్తెలు కోరిక మేరకు ఇక్కడ ఉండే అభాగ్యులకు ఆహారాన్ని అందించారని, దాతలు ముందుకు వచ్చి వీరి ఆకలి తీర్చాలన్నారు. ఉర్లం. శివతేజ మాట్లాడుతూ లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అన్నార్థులకు ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి స్ఫూర్తితోనే నగరంలో అనేక ప్రదేశాలలో అన్నవితరణ కార్యక్రమాలు చేపడుతున్నామని, నేటి దాత బాడీ బిల్డర్ విజయ్ కు, చిన్నారుల ఆలోచనకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డర్ వి. విజయ్ కుమార్, చిన్నారులు, నైట్ షెల్టర్ బాధితులు పాల్గొన్నారు.

# అండర్ -14 పురుషుల సౌత్ జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ నేషనల్ ఛాంపియన్ షిప్ - 2025 రన్నర్స్‌గా "ఆంధ్ర టీం"



**మైలవరం, (రాజధాని వార్తలు):** నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 3, 4వ తేదీలలో నేషనల్ స్థాయి బాలుర సౌత్ జోన్ టెన్నిస్ బాల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ 2025 ఆంధ్ర ప్రదేశ్ జట్టు రన్నర్స్‌గా నిలిచిందని క్రికెట్ సంఘం కార్యదర్శి కె.ఎస్.స్వామి తెలిపారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ సందర్భంగా గెలుపొందిన వారిని డాక్టర్ లకిరెడ్డి హనమీరెడ్డి, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆర్.డి.ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.ఎస్.స్వామి ఎల్‌బి ఆర్‌సిఇ ప్రిన్సిపాల్ కె.అప్పారావు మరియు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రాజ్ కుమార్ అభినందనలు తెలిపారు.

# ఈనెల 7న వాసవిమాత జన్మదిన మహోత్సవం



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి పట్టణంలో 1925లో స్థాపించి 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న బుధవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధ్యక్షులు బిల్లపాటి కృష్ణకుమార్ తెలియజేశారు. ఆరోజు ఉదయం అమ్మవారి పల్లకి ఊరేగింపు, తిరువీధి మహోత్సవం, గోపూజ శ్రీనగరేశ్వర స్వామి, శ్రీజనార్ధన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు, ఆలయ మండపంలో అమ్మవారు సోమర్తికి భక్తులు చ్చే బియ్యంతో అభిషేకం, అమ్మవారికి లక్ష మల్లె పూలతో అర్చన, సామూహిక లలిత శాస్త్రనామ పారాయణం, అన్న సమారాధన, వాసవి మాతకు 102 రకాల స్వీట్లు తో అమ్మవారికి నైవేద్యం, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ చుట్టూ వెండి రథం పై ఊరేగింపు, ఊంజల్ సేవ, కోలాటము, పై కార్యక్రమాలు జరుగుతాయి కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తెలియజేశారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan